క్లుప్తంగా

విద్యకు అధిక ప్రాధాన్యం



జగనన్న విద్యాకిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ మజ్జి శోభారాణి

పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీపీ మజ్జి శోభారాణి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె మండలంలోని సూడిగాం గ్రామంలో జగనన్న విద్యా కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యారంగంలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులను తీసుకువస్తోందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థికంగా ఆదుకునేందుకు ఏటా అమ్మ ఒడి పథకం కింద రూ.15వేల నగదు తల్లుల ఖాతాల్లో వేస్తున్నారని, అలాగే కార్పొరేట్ తరహా విద్యను అందించేందుకు పాఠశాలల్లో సాంకేతికతతో కూడిన ట్యాబ్‌లను అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సూరిబాబు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జోగింపేట సర్పంచ్ సేవలు ప్రశంసనీయం



సర్పంచ్ సింహాచలాన్ని సత్కరిస్తున్న సమరసత ఫౌండేషన్ సభ్యులు

సీతానగరం: జాతీయ స్థాయిలో పారిశుద్ధ్య పనుల్లో ఉత్తమ పంచాయతీగా తీర్చిదిద్దిన మండలంలోని జోగింపేట సర్పంచ్ కె.సింహాచలం సేవలు అభినందనీయమని సమరసత సేవా ఫౌండేషన్ ఉత్తరాంధ్ర జోన్ లీడర్స్ అడారి గంగాధర్, సురేష్‌లు ప్రశంసించారు. ఈ మేరకు మంగళవారం జోగింపేటలో సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులకు విచక్షణాతరగతులు సబ్ కమిటీ ధర్మ ప్రచారకర్త చప్ప విమల ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా గంగాధర్, సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించే జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య పనులు నిర్వహించడంలో ప్రధాన భూమికను పోషించిన సర్పంచ్ సింహాచలం సేవలు అభినందనీయమ న్నారు. సర్పంచ్ సింహాచలం జోగింపేట గ్రామానికి ఉత్తమ పంచాయతీగా జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి చేసిన కృషిని పలువురు సర్పంచ్‌లు స్ఫూర్తిగా తీసుకుని ఇతర గ్రామాల అభివృద్ధి, ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధతీసుకోవాలని కోరారు. సర్పంచ్ కె.సింహాచలాన్ని సమరసత సేవాఫౌండేషన్ సభ్యులు శాలువాతో సత్కరించారు.


క్రికెట్ టోర్నీ విజేత కొండవీధి జట్టు



విజేత జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎంపీపీ దీనమయ్య, తదితరులు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని కొండవీధి యువత ఆధ్వర్యంలో నిర్వహించిన కొండవీధి ప్రీమియం లీగ్(కేపీఎల్) క్రికెట్ టోర్నీ విజేతగా కొండవీధి జట్టు, రన్నర్‌గా కొండవాడ జట్టు నిలిచాయి. నెల రోజుల పాటు జరిగిన ఈ టోర్నీలు పరిసర గ్రామాలకు చెందిన 70 టీమ్‌లు పాల్గొన్నాయి. అందులో కొండవీధి, కొండవాడ జట్లు ఫైనల్‌కు చేరుకోగా.. మంగళవారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కొండవీధి జట్టు నిర్ణీత 12 ఓవర్లకు 3 వికెట్లు కోల్పోయి 106 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన కొండవాడ జట్టు 12 ఓవర్లకు 60 పరుగులు చేసి ఆల్ ఔట్ అయింది. విజేతలకు ఎంపీపీ కుంబురుక దీనమయ్య, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు నగదు పురస్కారంతో పాటు షీల్డ్‌ను అందజేశారు.

'మాతోట, జీవ' విస్తీర్ణంపై దృష్టి



మాతోట ఫలసాయాలను పరిశీస్తున్న అధికారులు

గుమ్మలక్ష్మీపురం: మా తోట జీవ పైలెట్ ప్రాజెక్టును రైతులు సద్వినియోగించుకోవాలని నాబార్డ్ అసిస్టెంట్ మేనేజర్ కె.గణేష్‌కుమార్, నాబార్డ్ కన్సల్టెంట్ సత్య ఒగ్గు అన్నారు. మండలంలోని గొరడ గ్రామంలో మంగళవారం రైతులతో సమావేశమై ప్రాజెక్టు లక్ష్యాలను వివరించారు. 12 ఏళ్ల కిందట నాబార్డ్ ఆర్థిక సహకారంతో 500 మంది రైతులకు చెందిన 500 ఎకరాల్లో మాతోట కార్యక్రమం(పండ్ల తోటల పెంపకం) ప్రారంభించినట్లు చెప్పారు. ప్రస్తుతం ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందన్నారు. జీవ పైలెట్ ప్రాజెక్ట్ కింద మొదటి విడతగా 40 మంది రైతులకు చెందిన 40 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయంతో పాటు వ్యవసాయ అనుబంధరంగాల ప్రోత్సాహంపై దృష్టిసారించినట్లు చెప్పారు. ఎంపిక చేసిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకొని, ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు మిగతా రైతులకు మార్గదర్శకంగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జీవ ప్రాజెక్ట్ అధ్యక్షుడు తాడంగి జమ్మయ్య, కార్యదర్శి కిల్లక చిరంజీవి, డైరెక్టర్ ప్రహరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమం

● ఎమ్మెల్యే జోగారావు



గంగాడలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందించి సంక్షేమ పథకాల వివరాలను తెలియజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందించడమే సీఎం జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలం గంగాడలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ దళారులు, సిఫార్సులు, నాయకుల ప్రమేయం లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందించాలని సీఎం జగన్‌మోహన్ రెడ్డి సూచిస్తున్నారన్నారు. ప్రజల వద్దకు పాలన అందించాలనే సంకల్పంతో గడప గడిచిన మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి గడప ఎక్కి గడిచిన కాలంలో ప్రభుత్వం నుంచి వారు పొందిన లబ్ధిని వారికి తెలియపరిచడం, అర్హత ఉండి సంక్షేమ పథకాలకు దూరంగా ఉంటే అటువంటి వారిని గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందేవిధంగా చర్యలు చేపట్టేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా స్థానికంగా ఉండే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేదిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజలకు సుభిక్షమైన పాలన అందించేందుకు జగన్మోహన్ రెడ్డి పాటుపడుతున్నారని అటువంటి నాయకుడిని ఆశీర్వదించి రానున్న కాలంలో ఆయననే మళ్లీ సీఎంగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ జి.నాగమణి, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, సూర్యనారాయణ, బి.నారాయణరావు, ఎస్.జగన్, జి.వెంకటినాయుడు, జి.జగన్, సర్పంచ్ మోహనరావు, మండలంలో వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బంగారు బాట



విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

● ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు జగనన్న ప్రభుత్వం బాటలు వేస్తోందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సీతానగరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యా కానుక కిట్లను విద్యార్థులు వారి తల్లిదండ్రులకు హెచ్‌ఎం ఐ.ప్రసన్న లక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వరుసగా 4వ ఏడాది 2023–24 విద్యా సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రూ.1042.53 కోట్ల ఖర్చుతో అమలు చేసిన జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా పల్నాడు జిల్లా కోసూరులో లాంచనంగా ప్రారంభించారన్నారు. ఈ క్రమంలో పార్వతీపురం నియోజకవర్గం, సీతానగరం మండలం పరిధిలో గల 3650 మంది విద్యార్థులకు జేవీకే కిట్లు పంపిణీ జరిగిందన్నారు. ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని అమలు చేస్తున్నందున విద్యార్థుల తల్లిదండ్రులు తప్పకుండా వారి పిల్లలను బాగా చదివించి ఉన్నత చదువులు చదివించేందుకు కృషి చేయాలని కోరారు. మీ అందరికీ ప్రభుత్వం తరఫున తప్పక సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందుతాయని, విద్యార్థులు కూడా చక్కగా చదువుకుని ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఇప్పటి వరకు జగనన్న విద్యా కానుకపై రాష్ట్ర ప్రభుత్వం రూ.3366.53 కోట్లు వెచ్చించందని చెప్పారు. ప్రతి పేద విద్యార్థి చక్కని అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావును పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ జి సూరిదేముడు, జెడ్పీటీసీ ఎం బాబ్జీ,ఎంపీపీ ప్రతినిధి బలగ శ్రీరాములు,స్థానిక సర్పంచ్ జే తేరేజమ్మ, ఎంపీటీసీలు బి కుసుమ, ఎస్ గౌరి, పాఠశాల ఉపాధ్యాయులు,వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, పలుగ్రామాల సర్పంచ్‌లు,ఎంపీటీసీలు విద్యార్థులు వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వేతనం గిట్టుబాటయ్యేలా
పనిచేయాలి



సూరంపేటలో మస్తరు పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: మండలంలో ఉపాధిపనుల్లో పాల్గొనే వేతనదారులు గిట్టుబాటు వేతనం పొందడానికి అనుగుణంగా నిర్దేశించిన కొలతల్లో పనిచేయాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం సూరంపేట,బక్కుపేట గ్రామాల్లోని చెరువుల్లో వేతనదారులు చేస్తున్న పనులను, మస్తరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సూరంపేటలో వేతన దారుల నుద్దేశించి మాట్లాడుతూ టెక్నికల్ సహాయకులు ఇచ్చిన కొలతల ప్రకారం పని చేసి గిట్టుబాటు వేతనం పొందాలని వేతనదారులకు సూచించారు. అలాగే మేట్‌లు మస్తరును విధిగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. చెరువు పనుల్లో పాల్గొనే వారంలో జంగిల్ క్లియరెన్స్ చేయించాలని, క్షేత్ర సహాయకులు, మేట్‌లు వేతనదారులకు పనులు కల్పించి గిట్టుబాటు వేతనం వచ్చేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్, క్షేత్ర సహాయకులు, మేట్‌లు పాల్గొన్నారు.

ఆర్బీకేల ద్వారా వరివిత్తనాల పంపిణీ



వరివిత్తనాలు రైతులకు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీరాములు

సీతానగరం: ఖరీఫ్‌సీజన్ సమీపించే సమయానికి మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాలకు ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు సమకూర్చి రైతులకు పంపిణీ చేయడం హర్షణీయమని జెడ్పీటీసీ ఎం.బాబ్జీ అన్నారు. ఈ మేరకు మంగళవారం పెదభోగిలి రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ శాఖ సమకూర్చిన వరి విత్తనాలను జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.శ్రీరాములు, వీఏఏ సుదీర్ ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పర్యవేక్షణలో పార్వతీపురం నియోజకవర్గానికి అవసరమైన వరివిత్తనాలు, ఎరువులు ముందు జాగ్రత్త చర్యగా ఉన్నతాధికారులతో చర్చించి విత్తనాలు ఎరువులు ఇండెంట్ ఇవ్వడంతో వాటిని సకాలంలో నిల్వలుంచామన్నారు. వీఏఏ సుధీర్ మాట్లాడుతూ ఎంటీయూ 1064, ఎంటీయూ 1121, స్వర్ణమసూరి, సాంబమసూరి, ఆర్‌జీఎల్ వరి విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అలాగే రైతులకు అవసరమైన ఎరువులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలియ జేశారు. కార్యక్రమంలో పెదభోగిలి, చినభోగిలి గ్రామాల సర్పంచ్‌లు జె.తేరేజమ్మ, కురమాన రాధ, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బి సూర్యనారాయణ, ఎస్.కిరణ్‌కుమార్, ఆర్వీ పార్థసారథి, బక్కు సూర్యనారాయణ, బి.ముకుందరావు, చినభోగిలి ఉపసర్పంచ్ గంట రమేష్, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ పండు

రైతులకు అండగా ప్రభుత్వం

పార్వతీపురంటౌన్: రైతులకు అండగా ప్రభుత్వం నిలుస్తుందని ములగ సర్పంచ్ పండు అన్నారు. ఈ మేరకు మంగళవారం బాలగుడబ గ్రామంలో రైతులకు ఖరీఫ్ 2023 సంవత్సరానికి విత్తనాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రంల ద్వారా రైతులందరికీ విత్తనాల పంపిణీ చేపట్టామని చెప్పారు. రైతులకు అవసరమైన సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలో బాలగుడబ సచివాలయం పంచాయతీ సిబ్బంది భార్గవ్, నాయకులు ముప్పల సత్యంనాయుడు, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



కార్యదర్శులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూరల్: పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని ఎంపీడీఓ డొంక త్రినాథులు అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశమయ్యారు. వర్షాకాలం ప్రారంభం కానున్న క్రమంలో గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తాగునీటి వనరులను క్లోరినేషన్ చేయించాలని, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ప్రభుత్వ పథకాల పంపిణీ తీరు, జగనన్న గృహ నిర్మాణాల తాజా స్థితిగతులపై సచివాలయాల వారీగా సమీక్ష చేపట్టారు. రక్తదాన దినోత్సవం సందర్భంగా అధికారుల పర్యవేక్షణలో బుధవారం స్థానిక కోటదుర్గ కళ్యాణ మండపం వద్ద నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరం విజయవంతం చేయాలని కోరారు.

ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ప్రారంభం

కొమరాడ:

మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్‌వాడీ సేవలు మరింత మెరుగ్గా అందించేందుకు సిబ్బంది కృషిచేయాలన్నారు. ఉమ్మడి జిల్లాలో కొమరాడ మండలం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలన్నీ పార్వతీపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కింద ఉండేవి. అయితే కొత్త జిల్లాలు ఏర్పాటయ్యాక సంబంధిత అధికారులు పరిపాలన సౌలభ్యం కోసం కొమరాడను ప్రత్యేక ప్రాజెక్ట్‌గా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీడీ కె.విజయగౌరి, పీఓ సుగుణకుమారి, ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, సర్పంచ్ గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాంతమ్మా.. చల్లగా చూడమ్మా..



గ్రామదేవత ఘటాలకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

భామిని: మండలంలోని బురుజోలలో కాంతమ్మతల్లి గ్రామదేవత సంబరాల్లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మంగళవారం పాల్గొన్నారు. గ్రామదేవత ఘటాలకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరినీ చల్లగా చూడమ్మా అని కాంతమ్మతల్లిని వేడుకున్నారు. అనంతరం సర్పంచ్ మడపాన కేశవరావు ఇంట్లో జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, జేసీఎస్ మండల కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ పత్తిక సింహాచలం, తదితరులు ఉన్నారు.

బత్తిలిలో బంగారమ్మతల్లి సంబరాలు

బత్తిలిలో బంగారమ్మతల్లి గ్రామదేవత సంబరాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించి ముర్రాటలు సమర్పించారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు వినియోగించుకోవాలి



అంగన్వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ శిరీష

సీతానగరం: ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా ఇళ్లవద్దనే రోగులకు ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలను వినియోగించు కోవాలని సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ శిరీష కోరారు. ఈ మేరకు మండలంలోని గుచ్చిమి గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులందరికీ వైద్యపరీక్షలు చేసి హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్నవారి ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుని తెలియజేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. గర్భిణులకు కావలసిన ఐరన్, కాల్షియం మల్టీవిటమిన్ టాబ్లెట్స్ ఇస్తూ ఆహారంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అదేవిధంగా వయోవృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, సుగర్, బీపీ, ఆస్తమా ఫిట్స్ తదితర వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి వైద్యం అందిస్తున్నామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు పౌష్టికాహారాన్ని సకాలంలో ఇవ్వాలని, ప్రీ స్కూల్ పిల్లల ఆరోగ్యం పట్ల అంగన్వాడీ టీచర్లు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం శ్రీదేవి, సూపర వైజర్‌లు, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, ప్రసాద్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అతిసార సోకకుండా జాగ్రత్తలు పాటించాలి

● డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: అతిసార వ్యాధి సోకకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు కోరారు. అతిసార నియంత్రణ పక్షోత్సవాల (ఐడీసీఎఫ్)లో భాగంగా స్థానిక చర్చివీధి పట్టణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, పిల్లలు, వారి తల్లులతో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు పిల్లల్లో డయేరియా(అతిసారం) లక్షణాలు గుర్తిస్తే వెంటనే వారికి ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ మాత్రలు నిర్దేశించిన మోతాదులో ఇవ్వాలని సూచించారు. ప్రతి విరేచనం తర్వాత ఓఆర్ఎస్ ద్రావణం, 14 రోజుల వరకు జింక్ మాత్రలు పాలలో లేదా నీటిలో కలిపి ఇవ్వాలని చెప్పారు. డయేరియా వల్ల పిల్లలు నీటి శాతం కోల్పోయి డీ హైడ్రేషన్‌కు గురవుతారని వెంటనే ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ మాత్రలు ఇచ్చి చికిత్స అందజేయాలన్నారు. అతిసార రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు అవసరమని స్పష్టం చేశారు. అన్ని ఆరోగ్య కేంద్రాల పరిధిలో, అంగన్వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్, జింక్ కార్నర్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ పిల్లలకు ఓఆర్ఎస్ అందజేసిన వివరాలు, డయేరియా లక్షణాలను గుర్తించిన పిల్లల వివరాలు నివేదికగా ప్రతిరోజూ వైద్య సిబ్బంది జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి సమర్పించాలని స్పష్టం చేశారు. ఈ నెల 17వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ వినోద్ కుమార్, సూపర్ వైజర్లు పుష్ప, జయగౌడ్, వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మెట్టవలసలో ప్రభుత్వ పాఠశాల ప్రారంభం



వేడుకగా ప్రారంభించిన మెట్టవలస ప్రాథమిక పాఠశాల

సాలూరు: మూడేళ్ల క్రితం మూసివేసిన మండలంలోని మెట్టవలస ఆర్‌సీఎం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల స్థానంలో మంజూరైన నూతన ప్రభుత్వ పాఠశాలను మంగళవారం వేడుకగా ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ ముప్పల ఆదయ్య అధ్యక్షతన ఎంఈఓ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు దండి శ్రీనివాసరావు పర్యవేక్షణలో అట్టహాసంగా కార్యక్రమం నిర్వహించారు. సుమారు 60 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలను మూసివేసిన క్రమంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర, విద్యా శాఖ మంత్రి బొత్ససత్యనారాయణల దృష్టికి ఆదయ్య, శ్రీనివాసరావు తదితరులు తీసుకువెళ్లారు. స్పందించిన మంత్రులు సంబంధిత అధికారులతో మాట్లాడి నూతన పాఠశాలను మంజూరు చేశారు. ఈ మేరకు పాఠశాలను మంగళవారం గ్రామస్తుల సమక్షంలో ప్రారంభించారు. ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణలకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



కుమ్మరిగుంటలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

● ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కొమరాడ: ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు అందివ్వడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని కంబవలస గ్రామ సచివాలయం పరిధి కుమ్మరిగుంట గ్రామంలో మంగళవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ నాలుగేళ్లలో ఒక్కో కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా లక్షలాది రూపాయల లబ్ధి చేకూరిందని అన్నారు. సంక్షేమ పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోని మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని, ఈ ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా ప్రజలు వైఎస్సార్‌సీపీని ఆదరించి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బావూజీనాయుడు, ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, పార్టీ కన్వీనర్ డి.జనార్దనరావు, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, సివిని, కొమరాడ పీఏసీఎస్‌ల చైర్మన్లు పప్పల గోపాలకృష్ణ, మరడాన సూరపునాయుడు, సర్పంచ్‌లు అంబటి వెంకటలక్ష్మి, దత్తి మురళీకృష్ణ, పార్టీ నాయకులు డాక్టర్‌శెట్టి మధుసుదనరావు, కెంగువ పోలినాయుడు, సచివాలయం కన్వీనర్లు ఎన్.స్వర్ణప్రియ, కొల్లు సింహాచలం, తోరిక సింహాచలం పాల్గొన్నారు.

స్టీల్ గ్లాసుల్లో రాగిమాల్ట్

వీరఘట్టం: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వారంలో మూడురోజులు రాగిమాల్ట్‌ను అందిస్తున్నారు. విద్యార్థులు రాగిమాల్ట్ తాగేందుకు అవసరమైన స్టీల్ గ్లాసులను ప్రభుత్వం సరఫరా చేసింది. జిల్లా వ్యాప్తంగా 98,612 మంది విద్యార్థులకు ఈ గ్లాసులను పంపిణీ చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.